



బృహత్తర బాధ్యత

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురికి.. బాపట్ల జిల్లా పరిధిలోని ఒకరికి చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కగా వారందరికీ కీలక శాఖలను కేటాయించారు. మంత్రివర్గ కూర్పులో మంగళగిరి, రేపల్లె, తెనాలి, అద్దంకి ఎమ్మెల్యేలకు పెద్ద పీట వేశారు. అదే సమయంలో శాఖల కేటాయింపులో కూడా అదే ప్రాధాన్యత లభించింది. లోకేశ్ మినహా నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లకు తొలిసారిగా మంత్రి పదవులు దక్కాయి. అయినా వారికి సీఎం చంద్రబాబు కీలక శాఖలను అప్పగించి బృహత్తర బాధ్యత పెట్టారు. తమ నేతలకు మంత్రి పదవి దక్కడంతో పాటు కీలకమైన శాఖలను చంద్రబాబు కట్టబెట్టడంతో కూటమి పార్టీ శ్రేణులతో పాటు జిల్లావాసులు ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఐదేళ్లలో విధ్వంసం తప్ప అభివృద్ధి మాటెరుగని ఆయా రంగాల్లో ఇక మీదట పురోగతి కనబడుతుందనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పతనానికి నాంది పలికి కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన నిర్ణయాలకు సంబంధించిన శాఖలు జిల్లా మంత్రులకు దక్కాయి. ఇక మీదట వీరు తీసుకునే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది.

- జిల్లా మంత్రులకు కీలక శాఖలు
- ప్రాధాన్య శాఖలతో సర్వత్రా హర్షం
- జిల్లా వాసుల ఆశలన్నీ అమాత్యులపైనే
- నారా లోకేశ్‌కు మానవ వనరులతో పాటు ఐటీ శాఖ
- అనగాని సత్యప్రసాద్‌ను వరించిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు
- గొట్టిపాటి రవికి విద్యుత్..
- మనోహర్‌కు పౌరసరఫరాలు

గుంటూరు, తెనాలి, బాపట్ల (ఆంధ్రజ్యోతి), మంగళగిరి, జూన్ 14: రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులకు శాఖల కేటాయింపు విషయంలో ఉత్కంఠతకు తెరపడింది. శుక్రవారం మంత్రుల శాఖలను వెల్లడించటంతో కూటమి శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. చంద్రబాబు కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాకు కీలక మంత్రిత్వ శాఖలు దక్కాయి. మొత్తం నలుగురికి మంత్రి వర్గంలో చోటు లభించిన విషయం తెలిసిందే. నలుగురిలో ముగ్గురు తొలిసారిగా మంత్రులయ్యారు. అయినా వారికి చంద్రబాబు కీలకశాఖలు అప్పగించారు. రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు, బాపట్ల లోక్‌సభ పరిధిలో మొత్తం నలుగురికి మంత్రులయ్యే అవకాశం దక్కింది. కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లా అభివృద్ధి అమాత్యులపై పడింది. తమ శాఖల ద్వారా తమతమ నియోజకవర్గాలతో పాటు జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం వారికి దక్కింది. మంత్రులకు కీలక శాఖలు దక్కడంతో కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లావాసుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమ నేతల మీద నమ్మకంతో కీలక శాఖలు కట్టబెట్టిన చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. మంగళగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు మాత్రమే మంత్రిగా చేసిన అనుభవం ఉంది. తెనాలి నుంచి ఎన్నికైన నాదెండ్ల మనోహర్, రేపల్లె నుంచి ఎన్నికైన అనగాని సత్యప్రసాద్, అద్దంకి నుంచి ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్‌లకు మాత్రం తొలిసారిగా మంత్రి పదవి దక్కింది. అయితే వీరికి గతానుభవం లేకపోయినా చంద్రబాబు కీలక శాఖల బాధ్యతలు అప్పగించడం విశేషం. లోకేశ్ గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఐటీ శాఖను మళ్లీ అప్పగించి అదనంగా మానవ వనరుల అభివృద్ధి శాఖను కేటాయించారు. ఆయనకు గతంలో ఐటీ శాఖ నిర్వహించిన అనుభవం ఉంది. ఈ పరిస్థితుల్లో రాజధాని ప్రాంతంలో ఐటీ అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఎన్నికల ప్రచారంలో యువతకు ఉపాధిపై లోకేశ్ హామీలు ఇచ్చి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల ద్వారా హామీలను నెరవేర్చే అవకాశం లోకేశ్‌కు వచ్చింది. ఇక తీర ప్రాంతం నుంచి ఎన్నికై చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న అనగానికి రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కేటాయించారు. ఇక వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ శాఖను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు అప్పగించారు. గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిన విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టే పెద్ద బాధ్యత రవిపై ఉంది. స్పీకర్‌గా చేసిన వారు మళ్లీ ఎన్నికల్లో గెలవడం అరుదనే వాదనలున్న తరుణంలో అది నిజంకాదంటూ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. పైగా తొలిసారి మంత్రి పదవి పొందినా ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను కేటాయించారు. గతంలో మనోహర్ ఉన్నత పదవులు అలంకరించినా, మంత్రిగా పదవిని పొందడం మాత్రం ఇదే తొలిసారి.

గతంలోనూ..

ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ శాఖలు అస్తవ్యస్తంగా మారాయన్న ఆరోపణల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లాకు చెందిన మంత్రులకు కీలక శాఖల బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. అయితే గతంలోనూ జిల్లాకు చెందిన వారు ఎన్నో కీలకశాఖలను నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పదవిని గత టీడీపీ హయాంలో దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ప్రత్తిపాటి పుల్లారావు, కాంగ్రెస్ పాలనలో కాసు కృష్ణారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. తిరిగి ఇప్పుడు ఈ శాఖ నాదెండ్ల మనోహర్‌కి కేటాయించారు. ప్రస్తుతం అనగానికి దక్కిన రెవెన్యూశాఖను గతంలో ఎన్టీఆర్ హయాంలో పొన్నూరు నుంచి గెలుపొందిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి కొంతకాలం నిర్వహించారు. గతంలో టీడీపీ హయాం లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే అవకాశం దక్కింది.



నాడు పౌరసరఫరాల్లో అక్రమాలు వెలికి తీసి.. నేడు మంత్రిగా

వైసీపీ హయాంలో పౌర సరఫరాల శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి.. భారీ నిధుల గోల్‌మాల్.. మళ్లింపు చేశారు.. చిక్కీలు, కందిపప్పు, రేషన్ బియ్యం దారిమళ్లించారు.. అంటూ పౌరసరఫరాల శాఖలో జరిగిన పలు కుంభకోణాలను జనసేన పీఏసీ ఛైర్మన్‌గా నాదెండ్ల మనోహర్ వెలుగులోకి తెచ్చారు. ఆయన బయటపెట్టిన ఏ కుంభకోణాన్నయినా పూర్తి ఆధారాలతోనే గతంలో వెల్లడించారు. దీంతో ఆయా శాఖల మంత్రులు కూడా వాటిపై స్పందించడానికి భయపడిన పరిస్థితి. కానీ మనోహర్ వాటిని వదలకుండా చివరి వరకు అంటే ఎన్నికలకు ముందు వరకు వెంటపడుతూనే వచ్చారు. ఈ నేపథ్యంలో తెనాలి నుంచి కూటమి తరపున గెలిచిన నాదెండ్లకు ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను మనోహర్ దక్కించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఇప్పుడు అంతటి కీలకమైన శాఖ ఆయన చేతికి రావడంతో ఆ కుంభకోణాల గుట్టు విప్పుతారని, వారి పనిపడతారనే ఆశాభావం జనం నుంచి వ్యక్తమవుతోంది.

లోకేశ్‌కు మళ్లీ ఐటీ..

మంగళగిరి నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు కూటమి ప్రభుత్వంలో కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కాయి. లోకేశ్ 2016-19లో శాసన మండలి తరపున ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు గతంలో నిర్వహించిన ఐటీ శాఖతోపాటు మానవ వనరుల అభివృద్ధి శాఖ అదనంగా దక్కింది. గతంలో ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను చంద్రబాబు ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారు. ఆయన తనయుడైన లోకేశ్‌కు ఐటీ శాఖపై పట్టు ఉంది. ఈ పరిస్థితుల్లో అమరావతి ఐటీ రంగంలో హైదరాబాద్‌తో పోటీ పడేలా లోకేశ్ పనితీరు ఉండే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ ఐటీ మంత్రిగా మంగళగిరి, గన్నవరం ప్రాంతాల్లో పలు ఐటీ సంస్థలను ఏర్పాటు చేయించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించారు. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో లోకేశ్ మరింత కసిగా అమరావతికి పెద్దఎత్తున ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయన కార్యాచరణను ప్రారంభించారని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం పగబట్టినట్టు పనిచేయడంతో అమరావతి ప్రాంతం అన్ని విధాలుగా వెనుకబడింది. అభివృద్ధిలో వెనుకంజ వేసిన అమరావతి ప్రాంతాన్ని మళ్లీ ముందుకు పరుగులెత్తించే విధంగా గొప్ప పనితీరును కనబరచాలని లోకేశ్ పట్టుదలగా ఉన్నారు. ఐటీ శాఖ దక్కడంతో మంగళగిరి, అమరావతి ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు లోకేశ్‌కు ఒకింత వెసులుబాటు కలిగినట్టయింది. లోకేశ్ మంగళగిరి నుంచి మంత్రివర్గంలో కొనసాగనుండడంతో నియోజకవర్గ ప్రజలు అయనపై ఎన్నో ఆశలు... మరెన్నో అంచనాలతో ఉన్నారు. 2029 నాటికి మంగళగిరి, అమరావతి ప్రాంతాలు లోకేశ్ సారథ్యంలో దేశానికి ఓ దిక్సూచిలా మారతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తున్నారు.



అనగానికి.. రెవెన్యూ చక్కదిద్దే అవకాశం

భూ వివాదాలు.. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక పలువురు బాధితులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. రెవన్యూ వ్యవస్థలో పాతుకుపోయిన నిర్లక్ష్యం, అవినీతి తాండవంతో భూయజమానులు, రైతులు అల్లాడిపోతున్నారు. రెవెన్యూ బాధితులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా వారి చెప్పులు అరగడం తప్పితే ప్రయోజనం ఉండడం లేదు. అంతే కాకుండా వైసీపీ ప్రభుత్వం దిగిపోయే ఏడాదిన్నరకు ముందు అసైన్డ్ చట్ట సవరణతో పాటు లంక భూములకు యాజమాన్య హక్కులనేవి వైసీపీ నేతలకే వరంగా మారాయని విమర్శలను అప్పట్లో టీడీపీ నేతలే చేశారు. ఇంతటి ప్రాధాన్య శాఖ రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను వరించింది. ఒకవిధంగా రెవెన్యూను చక్కదిద్ది తన పనితీరుతో ప్రభుత్వానికి కూడా మంచి పేరు తెచ్చే అవకాశం చంద్రబాబు అనగాని భుజస్కంధాలపై పెట్టారు. వైసీపీ నేతలు ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా భూములను చెరబట్టారు. వారికి కొమ్ముకాసే రెవెన్యూ సిబ్బంది అండతో వేల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై చంద్రబాబు సంతకం చేసినప్పటికీ ప్రజల్లో దాని తాలూకా భయాందోళనలు వెంటాడుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు ఐదేళ్లలో జరిగిన భూ మేతల పట్ల సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్లు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి.



గొట్టిపాటి చేతిలో విద్యుత్ ప్రక్షాళన

చంద్రబాబు అంటేనే నాణ్యమైన విద్యుత్.. కోతలు లేని సరఫరా. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ అంటే వినియోగదారులను పిండుకునేందుకు ఉపయోగించుకుంది. కరెంట్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఒక విధంగా వైసీపీ దారుణ పరాజయం వెనక మధ్యతరగతి నడ్డి విరిచిన కరెంటు బిల్లులు కూడా ప్రధాన కారణంగా ఉన్నాయి. రకరకాల సర్‌చార్జీల పేరుతో బిల్లులు చూస్తేనే షాక్ కొట్టేంతగా వైసీపీ పాలన సాగించింది. ఎడాపెడా చార్జీల భారం మోపడమే కాకుండా కార్యాలయాల ముందు వినియోగదారులు ధర్నాకు దిగిన ఉదంతాలను కూడా గతంలో చూశాం. వైసీపీ ఘోర ఓటమి వెనక ఇవన్నీ కూడా కీలకంగా పనిచేశాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం పై విద్యుత్ శాఖను పటిష్ఠ పరిచి చార్జీలు తగ్గించడమే కాకుండా నాణ్యమైన కోతలు లేని సరఫరాను ప్రజలు ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంతటి కీలకమైన శాఖ బాధ్యత చంద్రబాబు అనగానిపై పెట్టారు. విద్యుత్ శాఖలో ఐదేళ్లుగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు షాక్ కొట్టే కరెంటు చార్జీల నుంచి ప్రజలకు ఊరట కలిగించాల్సిన గురుతర బాధ్యత గొట్టిపాటిపై ఉంది.

నాడు ఉరి నేడు సరి?

117 జీవో BANNED

- ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవమే
- జీవో 117 రద్దు హామీపై ఉపాధ్యాయుల హర్షం
- వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో 500పైగా పాఠశాలల మూత
- జీవో 117పై ఆందోళనలను పట్టించుకోని నాటి పాలకులు

గుంటూరు(విద్య), జూన్ 14: వైసీపీ హయాంలో సీఎం జగన్ అనాలోచిత నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. 117 జీవో.. 500పైగా ప్రాథమిక పాఠశాలల ఉసురుతీసింది. ఈ జీవో వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టమని అటు ఉపాధ్యాయులు, ఇటు మేధావులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం ఆలకించలేదు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బడికి దూరమవుతారని తల్లిదండ్రుల గోడును పట్టించుకోలేదు. విద్యా వ్యవస్థను తీర్చి దిద్దాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవ హరించింది. అయితే ఎన్నికల ప్రచారంలో 117 జీవో రద్దుకు ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఈ క్రమంలో వైసీపీ ఓటమి పాలవడం.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జీవో 117 రద్దుతో పాటు విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను సరి చేస్తారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం రానుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. మౌలికవసతులతో పాటు విద్యార్థులు అక్కడ పూర్తిస్థాయిలో చదువుకునేలా ఏర్పాట్లు చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

విద్యార్థులు దూరం.. పోస్టులకు కోత


వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ 117 జీవోను తెచ్చారు. దీనివల్ల ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. మరో 3 వేల మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మిగిలారు. 2500పైగా ఉపాధ్యాయ పోస్టులకు కోత పడింది. లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూత వేయాల్సిన దుస్థితి నెలకొంది. జీవో 117తో ఊరి బడికి ఉరి వేయవద్దని ఉపాధ్యాయ సంఘాలు నెత్తినోరు బాదుకున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3500పైగా పైగా ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో విద్యాశాఖ లెక్కల ప్రకారమే 4.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయ పోస్టులు తగ్గించడానికే వైసీపీ ప్రభుత్వం జీవో 117 తీసుకువచ్చింది. ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని ఉన్నత పాఠశాల ల్లోకి విలీనం చేశారు. ఉన్నత పాఠశాలలు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండటంతో తల్లిదండ్రులు పిల్లల్ని అక్కడికి పంపేందుకు వెనుకంజ వేశారు. ఇంటి సమీపంలోని బడి మూతతో ఈ దుస్థితి నెలకొందని వారు వాపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. సాధారణంగా 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులు పదేళ్లలోపే ఉంటారు. వీరంతా సుదూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పిల్లల్ని తల్లిదండ్రులు తమకు అందుబాటులో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం ప్రారంభించారు. 1, 2 తరగతులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే వారు లేక అవి క్రమంగా నిర్వీర్యం అయ్యేస్థాయికి వచ్చాయి. మరోవు ఉన్నత పాఠశాలల్లో కూడా 3, 4, 5 తరగతుల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రాలేదు. దీంతో ఒక్క పల్నాడు జిల్లాలోనే దాదాపు 200పైగా పాఠశాలలు ఈ ఏడాది విద్యార్థులు లేక మూత పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారాల్లో జీవో 117 రద్దుకు సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. వైసీపీ అధికారం కోల్పోయి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం గతంలో వారిచ్చినట్లుగా జీవో 117 రద్దు అవుతుందని.. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.





ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుంటూరు)

రూ.6 కోట్లు హాం..ఫట్



- సొమ్ముతిన్న ప్రజాప్రతినిధి పరార్
- ఎన్‌జీవో నేతల గుండెల్లో రైళ్లు
- ప్లాట్లు కేటాయింపులో భారీ అవకతవకలు

గుంటూరు సిటీ, జూన్ 14: 'నియోజకవర్గ నేత చెప్పాడు గా ఎదురేముంది అనుకున్నారు. తన మన చూడకుండా బాదేశారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా వచ్చిందాన్ని వాటాలేసి పంచుకున్నారు. ఈ వ్యవహారంలో అయ్యవార్ల భాగోతం అక్షరాలా రూ.6 కోట్లు. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. సొమ్ము తిన్న నేత పత్తా లేకుండా పోయాడు. వసూళ్ళ చేసి పంచిన వాళ్ళు మాత్రం నిద్రపట్టక అల్లాడుతున్నారు. వచ్చిన కొత్త ఎమ్మెల్యే తాట తీస్తాడన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తం మీద పొన్నూరు ఎన్జీవో ప్లాట్ల కథ త్వరలోనే కంచికి చేరే అవకాశం కనపడుతుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై సీరియస్ గా ఉన్న ఎమ్మెల్యే రేపో మాపో మొత్తం వ్యవహారం పై చాకిరేవుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వైసీపీ ప్రభుత్వంలో ఆ ప్రజాప్రతినిధిని చూసుకొని రెండు చేతులా డబ్బులు వసూలు చేసిన ఎన్జీవో నేతలకు కష్టకాలం తప్పదన్న భావన వినపడుతోంది.

సొమ్మొకరిది.. సోకొకరిది

పొన్నూరులో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన ఎన్జీవో ఇళ్ల స్థలాలు వ్యవహారంలో అసలు ఎవరి సొమ్మును ఎవరు అమ్మకాలకు పెట్టారన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే లక్ష్యంతో 2004లో సొసైటీని ఏర్పాటు చేశారు. సాక్షి భవన్నారాయన స్వామి దేవస్థానంకు చెందిన 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నెంబర్ 221-1 లోని ఈ భూమిని ఎకరం రూ.4 లక్షలు చొప్పున అప్పటి ఉద్యోగుల నుంచి సేకరించిన సొమ్ముతో కొనుగోలు చేశారు. 3 సెంట్లు చొప్పున 98ప్లాట్లు, 4 సెంట్లు చొప్పున 146 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారంపై కొందరు కోర్టుకి వెళ్ళటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మధ్యలోనే నిలిచింది. గత ఏడాది చివర్లో ఎన్జీఓలకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు రావటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మార్గం సుగమం అయ్యింది.

ఎన్జీవోల అత్యుత్సాహం

వాస్తవానికి సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సర్వసాధారణంగా జరిగిపోతుంది. దాంట్లో ఎటువంటి సిఫార్సులు అవసరం లేదు. కానీ ఎన్జీఓ అసోసియేషన్‌లోని కొందరు నేతలు ఈ విషయంలో రాజకీయ నేతల జోక్యానికి తెరలేపారు. ఆయన లేకపోతే రిజిస్ట్రేషన్‌లు జరగవంటూ ప్రజాప్రతినిధిని ఎంటర్ చెయ్యటంతో డిమాండ్‌లు మొదలయ్యాయి. నేతకు ముట్టజెప్పాలని కొంత, ఖర్చుల కింద కొంత వసూలు చేశారు. ఒక్కో ప్లాట్‌కు రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు తీసుకున్నట్లు కొందరు బాధితులు చెబుతున్నారు. మొత్తం మీద రూ.6కోట్ల వరకు చేతులు మారాయని తెలుస్తోంది. అందులో అగ్రభాగం అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధికి చేరినట్లు సమాచారం. మిగిలిన వాటిని కొందరు నేతలు గుంటూరులో పంచుకున్నట్లు బాధితులు తీసిన వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

వాళ్ళకి అధికారం ఎందుకు?

పొన్నూరు ఎన్జీఓ ప్లాట్లు కేటాయింపు, రిజిస్ట్రేషన్‌లో ఆసాంతం అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అక్కడి ప్లాట్ల వ్యవహారానికి, గుంటూరుకు చెందిన నేతలకు ఏ విధమైన సంబంధం లేదు. కానీ ఇందులో నిర్ణయ అధికారం ఫలానా వారిది అంటూ చేసిన తీర్మానంతో అవకతవకలకు ఊతం దొరికింది. అసలు ఎన్జీవోలు కాని వారికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చెయ్యటంతో పాటు, వారి వద్ద అధిక మొత్తంలో వసూలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ ఒక్కో ప్లాట్ విలువ సుమారు రూ.40 లక్షల వరకు ఉండటంతో భారీగా అవినీతి జరిగిందని చెబుతున్నారు.

ఆ సొమ్ముతోనే జల్సాలు

ప్లాట్లు రిజిస్ట్రేషన్ పేరుతో వసూలు చేసిన సొమ్ముతోనే ఎన్జీఓ నేతలు భారీ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌లకు వైసీపీ ప్రజాప్రతినిధులను పిలిచి జల్సాలు చేశారు. మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేయించుకున్నారు. టీడీపీకి చెందిన వారికి ప్లాట్లు ఇవ్వాల్సి ఉన్నా వైసీపీ ముఖ్యనేత వద్దు అన్నారని రిజిస్ట్రేషన్ చెయ్యలేదు. కొందరు నేతలు అక్కడ వసూలు చేసిన సొమ్ముతో గుంటూరులో ఇళ్లను కొనుగోలు చేసినట్టు ఉద్యోగుల్లో ప్రచారం జరుగుతోంది.

పూర్తి విచారణ జరిపించాలి

పొన్నూరులో ఎన్జీఓ ప్లాట్లు రిజిస్ట్రేషన్‌లో భారీ అక్రమాలు జరిగాయి. అసలు ఎన్జీవోలు కానివారికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. మొత్తం ఈ వ్యవహారంలో ఎన్జీవో నేతల హస్తం ఉంది. రూ.కోట్లు చేతులు మారబట్టే ఉద్యోగులు కాకపోయినా రిజిస్ట్రేషన్ చేశారు. ఆ సొమ్మును అందరూ పంచుకున్నారు. నేను ఈ విషయాన్ని కలెక్టర్, ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాను. ఏసీబీ కోర్టులో కూడా కేసు వేస్తాను.

- జీవీ రావు, కామన్ మ్యాన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు


తుళ్లూరు చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న మహిళలు, రైతులు

రాజధాని రైతుల ప్రత్యేక ప్రార్థనలు

తుళ్లూరు, జూన్ 14: చర్చిలో, మసీదులో రాజధాని అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు ప్రార్థనలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం వెలగపూడి సచివాలయానికి వచ్చే క్రమంలో సీడ్ రోడ్డు మీద పూల మాన్పు పరచి అభిమానం చాటుకున్నారు. మండల కేంద్రం తుళ్లూరు ఆర్సీఎం చర్చిలో, మసీదులలో రైతు జేఏసీ నేతలు కాటా అప్పారావు, కొల్లి నరేంద్ర, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్, మహిళా జేఏసీ నేత కామినేని గోవిందమ్మ, ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం, క్రిస్టియన్ సోదరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


తుళ్లూరు మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న రైతులు ముస్లిం సోదరులు

జడ్పీలో బాహాబాహీ!

● జూనియర్‌పై రెచ్చిపోయిన సీనియర్ ఆడిటర్

గుంటూరు సిటీ, జూన్ 14: గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం శుక్రవారం ఆడిట్ ఉద్యోగుల రణరంగానికి వేదికైంది. జిల్లా ఆడిట్ కార్యాలయంలో సీనియర్ ఆడిటరుగా పనిచేస్తున్న ఒక ఉద్యోగి తన సహోద్యోగిపై బూతులతో రెచ్చిపోయాడు. ఈ ఘటన జిల్లా అధికారి సమక్షంలోనే జరిగిం ది. జడ్పీ భవనంలో ఆడిట్ సిబ్బంది ఇటీవల ఖాళీ చేసిన పై అంతస్తులోని పాత కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారి సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్, జూనియర్ ఆడిటర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఆడిట్ సిబ్బందిలో అనైక్యత అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. సమావేశంలో జూనియర్ ఆడిటర్ మాట్లాడుతుండగా సీనియర్ ఆడిటర్ ఆగ్రహంతో అతడిని పలుమార్లు దూషించినట్లు తెలుస్తోంది. ఆనక అతడిని పక్కకు తోసివేసి కుర్చీతో అతడిని కొట్టబోయినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు బాధితుడు బయల్దేరగా సిబ్బంది అతడిని ఆపి సర్దిచెప్పారు. తమ భవనంలో ఆడిట్ సిబ్బంది కొట్లాటకు దిగడంపై జడ్పీ సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అవ్వా.. తాతలకు.. పండగే!

ఇంటి పెద్ద కొడుకుగా అవ్వాతాతలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. తాను అధికారం చేపట్టిన వెంటనే పింఛను మొత్తాన్ని రూ.3 నుంచి 4 వేలకు పెంచుతానని చెప్పినట్లుగానే చంద్రబాబు, తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆ హామీని నెరవేర్చేందుకు పూనుకున్నారు. యువత కోసం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన ఆయన పింఛను దస్త్రాలపై మూడో సంతకం చేశారు. అవ్వాతాతలకు పెద్దకొడుకులా, ఒంటరి, వితంతు మహిళలకు అన్నలా తోడు నిలుస్తూ పింఛను మొత్తాన్ని 4వేలకు పెంచుతూ సంతకం చేశారు. దివ్యాంగులకు పింఛను మొత్తాన్ని రెట్టింపు చేసి వారికి భుజం కాశారు. సంతకం చేయడమే తడవుగా శుక్రవారం అధికారులకు జీవో చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మించి పింఛను వరాన్ని ఇచ్చారు.

- ఇక నుంచి రూ.4 వేల పింఛను.. జూలై నెలలో రూ.7వేలు
- దివ్యాంగులకు రూ.3 నుంచి 6 వేలకు పెంపు
- పూర్తి వైకల్యం, పక్షవాతంతో మంచం పట్టినవారికి రూ.15వేలు
- తీవ్ర అనారోగ్య బాధితులకు రూ. 5 నుంచి 10 వేలకు పెంపు
- నాడు రూ. 200 నుంచి 2 వేలకు పెంచిన చంద్రబాబు
- నేడు ఇచ్చిన హామీ మేరకు రూ.3 నుంచి 4 వేలకు పెంపు
- మూడు జిల్లాల్లో 7,73,482 మందికి చేకూరనున్న లబ్ధి

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో సామాజిక భద్రతా పింఛన్లు రూ.3 వేలు నుంచి 4 వేలకు పెంచుతారన్న హామీ మాత్రమే ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా దివ్యాంగులు, అనారోగ్య బాధితుల పింఛను అంతకు మించిన స్థాయిలో పెంచుతూ కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు, హెచ్ఐవీ బాధితులు, డప్పు కళాకారులు, ఇతర కళాకారుల పింఛను రూ.3 నుంచి 4 వేలకు పెంచారు. పాక్షిక దివ్యాంగులు, కుష్ఠు వ్యాధి బాధితులకు పింఛను మొత్తాన్ని రెట్టింపు చేశారు. వారికి రూ.3 నుంచి 6 వేలకు పింఛను పెంచారు. పూర్తిగా వైకల్యంతో వున్న దివ్యాంగులు, పక్షవాతంతో మంచం పట్టినవారు, ప్రమాదం కారణంగా మంచం పట్టినవారి పట్ల చంద్రబాబు చూపిన ఔదార్యం ఔరా అనిపించింది. వారికి పింఛను ఒక్కసారిగా మూడు రెట్లు పెంచారు. ఇప్పటివరకూ రూ.5 వేలు పింఛను తీసుకునే వారికి ఇక నుంచి రూ.15వేలు పెంచి ఇవ్వనున్నారు. దీర్ఘకాలిక అనారోగ్య బాధితులు, గుండె, కాలేయం, మూత్రపిండాల మార్పిడి బాధితులు, సాధారణ డయాలసిస్ బాధితులకు ఇప్పటి వరకూ ఇస్తున్న రూ.5 వేల పింఛనును ఇక నుంచి రూ.10 వేలకు పెంచారు. దీంతో వారికి ఇతరులపై ఆధారపడి, భారం కాకుండా ఉండేలా చంద్రబాబు భరోసా ఇచ్చారు.

పెంచిన పింఛన్ల వివరాలు

కేటగిరి	ప్రస్తుతం	పెంచిన తర్వాత
వయోవృద్ధులు	3000	4000
వితంతువులు	3000	4000
చేనేత కార్మికులు	3000	4000
కల్లుగీత కార్మికులు	3000	4000
మత్స్యకారులు	3000	4000
ఒంటరి మహిళలు	3000	4000
చర్మకారులు	3000	4000
హెచ్ఐవీ బాధితులు	3000	4000
ట్రాన్స్‌జెండర్లు	3000	4000
డప్పు కళాకారులు	3000	4000
ఇతర కళాకారులు	3000	4000
దివ్యాంగులు	3000	4000
వయోవృద్ధులు	3000	6000
కుష్ఠు బాధితులు	3000	6000
పూర్తి వైకల్యం	5000	15000
పక్షవాత బాధితులు	5000	15000 (కదలలేనివారు)
మంచం పట్టినవారు	5000	15000
సాధారణ డయాలసిస్	5000	10000
కిడ్నీ, గుండె, లివర్‌మార్పిడి	5000	10000

మూడు జిల్లాల్లో 7.73 లక్షల మందికి లబ్ధి

తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులు వున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలై నెలలో అందనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్లు అందించనున్నారు. జూలై నెలలో ఇచ్చే పింఛనుతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వెయ్యి రూపాయల చొప్పున పెరిగిన రూ.3 వేలు కలిపి జూలై నెలలో 7 వేలు అందించనున్నారు.

200 నుంచి 4 వేలకు...

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయిన వెంటనే రూ.200గా వున్న సామాజిక భద్రతా పింఛనును ఒక్కసారిగా ఐదురెట్లు పెంచి రూ.వెయ్యి రూపాయలు చేశారు. ఆ తరువాత మరో మూడేళ్లకు పింఛనును రెట్టింపు చేస్తూ రూ.2 వేలకు పెంచారు. అంటే చంద్రబాబు 2014లో పదవి చేపట్టేనాటికి రూ.200గా వున్న పింఛను పదిరెట్లు పెరిగి రూ.2వేలు అయింది. కాగా 2019 ఎన్నికల సందర్భంగా తాను పింఛను రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన వెంటనే మాట తప్పారు. నాలుక మడతేసి తాను దశలవారీగా పెంచుతానని అవ్వాతాతలను వంచించారు. రెండేళ్లకొకసారి రూ.250 చొప్పున పెంచి వారిని వంచించారు. సరిగ్గా ఎన్నికలకు మూడు నెలల ముందు రూ.3వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. ఐతే పింఛనుదారులు ఎవరూ వారి మాటలు నమ్మలేదు. చంద్రబాబుకే మళ్లీ పట్టం కట్టారు. అన్నమాట ప్రకారం ఒక్కసారిగా రూ.వెయ్యి రూపాయలు పెంచి పింఛనును రూ.3వేల నుంచి 4 వేలు చేసి పింఛనుదారులకు చంద్రబాబు మేలు చేశారు.


బాలకార్మిక వ్యతిరేక మాసం వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి పార్థసారథి

బాల కార్మిక నిరోధం ప్రతి ఒక్కరి బాధ్యత

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు(లీగల్), జూన్ 14: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించటం, బాల కార్మిక నిరోధంను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీ ఎస్‌బీవీ పార్థసారథి అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఏ.అనిత, చైల్డ్ రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన పార్థసారథి మాట్లాడుతూ తల్లి తండ్రులకు తమ పిల్లలందరిని పాఠశాలకు పంపించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనిత మాట్లాడుతూ విద్యావంతులైన బాలల వలన మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ అఫ్ లేబర్ ఏ గాయత్రి, జిల్లా బాలల రక్షణాధికారి సీహెచ్ విజయ్‌కుమార్ చైల్డ్ రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్ జిల్లా కోర్డినేటర్ కె సమీర్, బచపన్ బచావో అందోళన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జి తిరుపతిరావు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పార్థసారథి 'బాలకార్మిక వ్యతిరేక మాసం వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. సీనియర్ పానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాస్ బాలకార్మికుల చట్టాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఆటోమెటిక్ టిక్కెట్టు వెండింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, జూన్14: ప్రయాణికుల అవసరాలకు తగిన విధంగా బాపట్ల రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఆటోమెటిక్ టిక్కెట్టు వెండింగ్ మిషన్ పనితీరును పరిశీలించి అక్కడ ఉన్న ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమృత్ రైల్వే ప్రాజెక్ట్ పనులు వల్ల లైట్లు వెలగక ప్లాట్ ఫారాల మీద వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఫాస్ట్‌ట్రైన్స్ ఆగటం లేదని ప్రయాణికులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయమై రైల్వేమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. గుంటూరు, విజయవాడ వెళ్ళే ఉద్యోగుల కోసం బాపట్ల నుంచి ఇంటర్‌సిటీ ట్రైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనతో ఫోన్‌లో మాట్లాడవచ్చునని లేదా వాట్సప్‌లో మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చు అన్నారు.

పరిషత్ నిర్వాహకుడు నాగభైరు కన్నుమూత


నాగభైరు సుబ్బారావు(ఫైల్)

చిలకలూరిపేట, జూన్ 14: చిలకలూరిపేట మండలంలోని నాగభైరువారిపాలెంలో కాకతీయ కళాపరిషత్ అధ్యక్షుడు నాగభైరు సుబ్బారావు(86) శుక్రవారం మృతిచెందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఆయన జాతీయస్థాయిలో ఆ గ్రామంలో 18 సంవత్సరాలపాటు నాటకపోటీలను నిర్వహించి పరిషత్‌ల నిర్వహణలో మైలురాయిని సృష్టించారు. అంత్యక్రియలు శనివారం ఉదయం ఆ గ్రామంలో జరుగుతాయి. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు జక్కంపూడి సీతారామారావు, కళాకారులు మల్లాది శివన్నారాయణ, కొల్లా రాధాకృష్ణ, నాయుడు గోపి, కృష్ణేశ్వరరావు, డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, ముద్దన రాఘవయ్య చౌదరి తదితరులు సంతాపం ప్రకటించారు.

ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారానికి

దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్14: ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రచయిత్రులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబరు 7న గుంటూరులో జరిగే ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకల్లో విజేతలకు నగదు బహుమతి ప్రదానం, సన్మానం జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు (98494 97739), డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు(93930 15584), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (98483 51517) నెంబర్లును సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు పురస్కారం

గుంటూరు(విద్య), జూన్ 14: ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ (అవోపా) బ్యాంకు మెన్ చాప్టర్ హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఎంసెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వీఈ రమణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సెల్ నం 9441928528లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్

పెదకాకాని, జూన్ 14: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెల్ఫ్ సపోర్టు కేటగిరీలో భర్తీ చేయనున్న డ్యూయల్ డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ శనివారం నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఏఎన్‌యూలోని స్టాటిస్టిక్స్ విభాగం, విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాల, విశాఖపట్నంలోని ఎంఎస్ఆర్ఎస్ సిద్ధార్థ కళాశాలలో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు సకాలంలో దరఖాస్తు చేసుకోలేనివారు నేరుగా తమ ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి సంబంధిత అధికారి అనుమతి తీసుకొని పరీక్షకు హాజరు కావచ్చునని డాక్టర్ అనిత సూచించారు.

ఎంత త్వరగా పద్ధతులు మార్చుకుంటే అంత మేలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ శాఖల అధికారులు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 14: ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనకు అలవాటు పడిన యంత్రాంగం అంతా ఎంత త్వరగా వారి వారి పద్ధతులు మార్చుకుంటే అంత మేలు అని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. సమస్యలతో తమ వద్దకు వచ్చే ప్రజలందరికీ ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది జవాబుదారి తనంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అఖిల భారత సర్వీసుల అధికారులకు ఏ విషయాల్లో ఐతే తీరు మారాలని దిశ నిర్దేశం చేశారో అవే అందరికీ వర్తిస్తాయని ప్రత్తిపాటి అన్నారు. ఆయనకు శుక్రవారం వివిధ శాఖల అధికారులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. కలసిన వారిలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆర్టీవో అధికారులు, నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారులు, విద్యుత్ శాఖ ఏడీఈ, పట్టణ సచివాలయాల సిబ్బంది, మహిళా పోలీసులు, డీఆర్‌వో వినాయకం, తహసీల్దార్ జ్వాల నరసింహం తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు అనగాని కృతజ్ఞతలు



రేపల్లె, జూన్ 14: రెవెన్యూశాఖ కేటాయించటం పట్ల తాడేపల్లిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను విస్మరించకుండా విధులు నిర్వహిస్తానని, రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అనగాని తెలిపారు. మంత్రి పదవికి సహకరించిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, సహచర మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మారెడ్డిని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

గుంటూరు సిటీ, జూన్ 14: మాచర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన జూలకంటి బ్రహ్మారెడ్డిని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా దంపతులు శుక్రవారం కలిశారు. గుంటూరులోని జూలకంటి నివాసంలో ఆయనను కలిసిన చైర్‌పర్సన్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాచర్లలో అనేక ఒత్తిడులు ఉన్నా ధైర్యంగా పోరాడి గెలుపు సాధించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ జూలకంటిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

రూ.15 లక్షల విలువచేసే..

పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేత


విత్తనాల గోడౌన్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి

గుంటూరు సిటీ, జూన్ 14: గుంటూరు నగరం ఏటుకూరు రోడ్డులోని షాపులపై విత్తన తనిఖీబృందం శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో క్రిస్టల్ కంపెనీకి చెందిన స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేనందున రూ.15లక్షలు విలువైన పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. తొలుత కంపెనీ గోడౌన్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులు 1830 పత్తి విత్తనాల ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. సదరు విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా అందులో తగిన వివరాలు లేనట్టుగా గమనించారు. అదేవిధంగా సిద్ధార్థ సీడ్స్, ఆదిత్య సీడ్స్, కావేరి సీడ్స్‌కు చెందిన గోడౌన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పురుగుమందుల పరీక్షా కేంద్రం ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి, అర్బన్ ఏవోలు భవనం అంజిరెడ్డి, బి.కిషోర్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

32 కిలోల గంజాయి పట్టివేత

● ముగ్గురు నిందితుల అరెస్టు

మాచర్లటౌన్, జూన్ 14: మండలంలోని విజయపురిసౌత్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో శుక్రవారం గంజాయి పట్టుబడింది. రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ కె.సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి మాచర్ల వైపు వస్తున్న కేఏ03 ఎండి 2710 నంబరు గల కారును చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆపి తనిఖీచేయగా సుమారు 32 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారులో ఉన్న మడకా రాంబాబు, బుంగర రాజేశ్వరి, చోలంగి చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకున్నారు. రాంబాబు, రాజేశ్వరిది అల్లూరి సీతారామరాజు జిల్లా కాగా, చంద్రశేఖర్ రాజమండ్రికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరంతా ఓ ముఠా సభ్యులు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నారు. 32 కేజీల గంజాయి సుమారు రూ.3.20లక్షల దాకా ఉంటుందని సీఐ చెప్పారు. ఆంధ్ర-కర్ణాటక బోర్డర్‌లో రాజారెడ్డి, సురేందర్‌రెడ్డిలకు గంజాయిని అందించడానికి తీసుకొస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలోనే రాజారెడ్డి, సు రేందర్‌రెడ్డిలను కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలో విజయపురి సౌత్ ఏఎస్ఐ సోమ్లానాయక్, సాంబనాయక్, విజయ్, సీతయ్య పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సురేష్

31,130 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,324 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 31,130 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,588 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తెల్లకాయలు	5000	10500
334	8000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11000	16000	334	11000	14500
273	10000	16000	నెంబరు. 5	13000	14000
341	8500	17200	273	14500	15000
4884	--	--	341	8000	17000
సూపర్ 10	--	--	4884	14500	17000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	19700	తేజ	9000	20000
బ్యాడిగి	9000	17000	బ్యాడిగి	9000	16500
దేవనూరుడీలక్స్	8500	14500	తెల్లకాయలు	5000	11500



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

రాష్ట్రంలోని పేద ప్రజలకు ఇక స్వర్ణయుగమే

• ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజలకు ఇకపై అంతా స్వర్ణయుగమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. పొన్నూరు రోడ్డులోని టీడీపీ గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 5 హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేయటం హర్షనీయమన్నారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి కరెంట్ బిల్లులు అధికంగా వచ్చాయని కుంటి సాకులు చూపించి పింఛన్లు సహా అనేక పథకాలను ప్రజలకు దూరం చేశారన్నారు. ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత నిర్వేదానికి గురయ్యారన్నారు. చంద్రబాబు నేతృత్వం, పవన్ కళ్యాణ్ ఆలోచన విధానాలతో మంచి పరిపాలన అందించే దిశగా అడుగులు వేస్తామన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మహిళలు, అంగన్వాడీ సిబ్బంది, పింఛనుదారులు, యువకులు నసీర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటరు షౌకత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, జాగర్లమూడి శ్రీనివాసరావు, వాణి, ప్రభాకర్, నరసింహారావు, శ్రీను నాయక్, ఐలా శ్రీనివాసరావు, సత్యం, కొండలు, కిరణ్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నసీర్‌కు ఉర్దూ డీఐ, ఎంఈవోలు అభినందనలు

గుంటూరు(విద్య), జూన్ 14 : గుంటూరు మండల విద్యాశాఖాధికారి నాగేంద్రమ్మ, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం నూతనంగా ఎన్నికైన తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అక్కడ చదువుతున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఒక పండుగ వాతావరణంలో చేపట్టాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు.

ఐజీని కలిసిన గల్లా మాధవి దంపతులు

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు శుక్రవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించారు. ఎన్నికల సమయంలో పోలీసు యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐజీని కలిసిన వారిలో దామచర్ల శ్రీనివాసరావు ఉన్నారు.



ఐజీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు

కార్యకర్తల క్షేమమే మా ధ్యేయం : డేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమంపై టీడీపీకి ఉన్న చిత్తశుద్ధి, అంకితభావం మరే ఇతర రాజకీయ పార్టీకి లేదని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండ్లమూడి మధు గుండె సమస్యతో బాధపడుతూ బైపాస్ సర్జరీ చేయించుకున్న సందర్భంగా డేగల ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం విషయంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు. దేశంలో ఏ పార్టీలో లేని విధంగా ఒక్క టీడీపీలో మాత్రమే కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని తెలిపారు. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన మధు ఇలా అనారోగ్యం పాలవటం బాధాకరమన్నారు. మధు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నగర పార్టీ కార్యదర్శి నిశంకరరావు అమర్నాథ్ పాల్గొన్నారు.



బండ్లమూడి మధును పరామర్శిస్తున్న డేగల ప్రభాకర్

మెగా డీఎస్సీపై సంతకంతో విశ్వసనీయత చాటిన చంద్రబాబు

• తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేసి 16,437 పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు తన విశ్వసనీయతను చాటుకున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ అన్నారు. యువతకు అండగా నిలిచిన యువనేత నారా లోకేశ్‌కు శుక్రవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువాతో సన్మానించారు. సాయికృష్ణ మాట్లాడుతూ తాను అధికారంలోకి రావడానికి ఏటా మెగా డీఎస్సీ పెడతామని చెప్పిన జగన్‌రెడ్డి యువతను వంచించారన్నారు. ఐదు హామీలను నెరవేర్చేలా ఫైళ్లపై సంతకాలు చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాయికృష్ణ

ఉపాధ్యాయ సంఘాల హర్షం

గుంటూరు(విద్య), జూన్ 14 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి డీఎస్సీ ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర నాయకులు బి.తిరుపాల్, జనరల్ సెక్రెటరీ తులసీదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా శాఖ వినాశనానికి కారణమైన జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. విద్యా శాఖను లోకేశ్‌కు కేటాయించటం హర్షణీయమని సంఘ నాయకులు మాల్యాద్రిరెడ్డి, చలపతిరావు, ఎండీ ఖాసిం, రమణయ్య పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఐదు హామీలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టిన జగన్మోహన్ రెడ్డికి చెంప దెబ్బలాగా మెగా డీఎస్సీపై సంతకం పెట్టడం చూస్తే ఉద్యోగుల కోసం ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ అర్థం అవుతుందన్నారు. ప్రజల ఆస్తిని కబ్జా చేసుకునే విధంగా జగన్ తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేశారన్నారు. రూ.3 వేలు ఇస్తున్న పింఛన్‌ను రూ.4 వేలు చేశారని ఆయన చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాలను బయటకు తియ్యడం కోసం, సేవారంగం అభివృద్ధి కోసం స్కిల్ సెన్సెస్‌పై చంద్రబాబు సంతకం చేసారన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరించారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అనాలోచిత, కక్షపూరిత నిర్ణయాలతో అభివృద్ధిలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిన జగన్‌రెడ్డి దుష్ట పరిపాలనకు చరమగీతం పాడిన రాష్ట్ర ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, నూతలపాటి రామారావు, దామచర్ల శ్రీనివాసరావు, గుంటుపల్లి మధుసూదనరావు, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య, రావిపాటి సాయికృష్ణ పాల్గొన్నారు.

జంతు హింస చట్టాల ఉల్లంఘనలు జరగరాదు

• కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



జంతు హింస నివారణపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బక్రీద్ పర్వదినం సందర్భంగా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, జంతు హింస నివారణ చట్టాల ఉల్లంఘనలు జరగకుండా ఆహ్లాదకర వాతావరణంలో సజావుగా నిర్వహించుకునేలా సంబంధిత శాఖల నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ 17న బక్రీద్ పర్వదినం రోజున జంతువధలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో పోలీసు, మున్సిపల్, పంచాయితీ, రెవెన్యూ, పశుసంవర్థక, రవాణా శాఖల అధికారులతో నోడల్ అధికారులను నియమించటం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా ప్రత్యేకంగా పికెట్లు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నిల్, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, పశుసంవర్ధక శాఖ జేడీ జెపీ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ వసంతరాయుడు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ జమీర్ బాషా, ఆర్టీఓ ఎన్ గోపాల్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయిమ్ అహ్మద్, ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, జీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆషా, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి, జంతుహింస నివారణ సంఘం ప్రతినిధులు దాసరి రాము, బీవి శివరాం పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దలు సహకరించాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 14 : గుంటూరు నగరంలో బక్రీద్ పండుగ సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని, నగరపాలక సంస్థకు ముస్లిం మత పెద్దలు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 17న జరగబోయే బక్రీద్ పండుగ నిర్వహణ పై ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పోలీ సు, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికా రులతో ప్రత్యేక సమావేశం జరిగింది. డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ మసీదుల్లో ముస్లిం పెద్దలు గోవధ నిషేధం, పండుగ నిర్వహణపై సూచనలు చేయాలన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎక్కడైనా గోవధ జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే జీఎంసి కంట్రోల్ రూమ్ 98499 08391కు లేదా 0863-2345103 నంబర్లకు కాల్ చేసి తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మీ, సిఎంటహెచ్ డాక్టర్ ఆషా, యంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్, ఎస్.ఎస్.లు గోసంరక్షణ సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదాన శిబిరం పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు (మెడికల్) జూన్ 14: అవసరమైన రోగులకు రక్తం అందిచగలిగితే ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్ కుమార్ తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని గుంటూరు వైద్య కళాశాలలలో జీజీహెచ్ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన ప్రసంగించారు. శుక్రవారం ఒకేరోజు ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, మెడికల్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా మొత్తం 185 యూనిట్ల రక్తసేకరణ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సింధూర రాణి, డాక్టర్ రాధిక, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జీజీహెచ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శుశ్రుతహాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈనెల 27న ప్రభుత్వాస్పత్రి నాట్కో సెంటర్‌లో జరిగే యూనియన్ 18వ మహాసభలపై రూపొందించిన పోస్టర్లను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వడ్డే బాలయ్య పాల్గొన్నారు.

రక్తదానం గొప్పదానం

అన్ని దానాల్లో కంటే రక్తదానం గొప్పదని సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం 78 సార్లు రక్తదానం చేసిన సునీల్‌కుమార్‌ను, 56 సార్లు రక్తదానం చేసిన ముమ్మనేని భానుమతి, అధిక సంఖ్యలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించిన రావిపాటి కిరణ్, నరేంద్రకుమార్‌లను రెడ్‌క్రాస్ సొసైటీ తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ వడ్లమాని రవి, వైస్ ఛైర్మన్ పి రామచంద్రరాజు, సభ్యులు రవి శ్రీనివాస్, వడ్లమాని రాజ్యలక్ష్మీ, పాటిబండ్ల శివరంజనీ, అడపా వేణు, మట్టుపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

చిప్స్‌లో రక్తదాన శిబిరం

గుంటూరు(విద్య), జూన్ 14 : స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర పేర్కొన్నారు. కార్యక్రమానికి రమేష్ హాస్పటల్ నుంచి పలువురు సిబ్బందితో పాటు డాక్టర్ ఆర్.మమతా హాజరయ్యారని ఎన్ఎస్ఎస్ విభాగ అధిపతి డాక్టర్ సుబ్బారావు తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడంతోపాటు 60 మంది రక్తదానాన్ని చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర వివరించారు.



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ ఆర్.మమత తదితరులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

• జీఐఏఎల్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు నంద

గుంటూరు(తూర్పు), జూన్ 14 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయటం హర్షించదగ్గ విషయమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఏ.ఎల్)రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పర్చూరు నంద ఆనందాన్ని వ్యక్తం చేశారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఉద్యమానికి కేంద్రంగా ఈ చట్టాన్ని రద్దు చేయాలని వివిధ రూపాలలో సుదీర్ఘమైన పోరాటాన్ని చేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. పేద సామాన్య ప్రజల హక్కుల్ని కాపాడే విధంగా కోర్టుల మీద నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ భూహక్కు చట్టాన్ని రద్దు చేయడం ప్రజా విజయమన్నారు.

విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

గుంటూరు(తూర్పు), జూన్ 14 : నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై రవాణ శాఖ అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఫిట్నెస్ లేకుండా తిరుగుతున్న బస్సులపై 9 కేసులు, పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన 17 మొత్తం 26 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ జిల్లాలోని పలు విద్యాసంస్థలకు చెందిన 662 బస్సులు ఫిట్నెస్ పొందకుండా రోడ్లపై తిప్పుతున్నారని వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. తనిఖీల్లో రవాణా శాఖ అధికారులు గోపాల్, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షల అవకతవకలపై విచారణ జరిపించాలి

గుంటూరు, జూన్ 14 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన 2024 పరీక్షలో జరిగిన అవకతవకలపై, పరీక్ష పేపర్లు లీకైన విధానంపై తక్షణమే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి, నీట్ పరీక్షలను మరల నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ శుక్రవారం హిమనీ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నినాదాలతో ఆందోళన చేశారు. కరిముల్లా మాట్లాడుతూ ఎన్నడూ నీట్ పరీక్షల్లో కనివిని ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా 76 మందికి మొదటి స్థానం రావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు తిరుమలరావు, మదన్, సుమంత్, రాజు, మీరావలి, బాబు తదితరులున్నారు.

ఐదేళ్లుగా నష్టపోయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలి

గుంటూరు, జూన్ 14: గత ఐదేళ్ల జగన్ పాలనలో పరిశ్రమలు లేక ఆర్థిక లోటుతో భవిష్యత్తుపై అనిశ్చితి మేఘాలు ముసురుకున్న పరిస్థితులలో చంద్రబాబు అపార అనుభవం, దార్శనికత రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడతాయని ప్రజలు గట్టిగా నమ్మి కూటమికి ఊహించని విజయం చేకూర్చారని విద్యావేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'కొత్త ప్రభుత్వం-బాధ్యతలు' అనే అంశంపై శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఆర్.రామచంద్రరావు మాట్లాడుతూ ఇకపై విధ్వంసాలు, కక్ష సాధింపులు, అరాచక రాజకీయాలు ఉండవని ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో చేసిన ప్రసంగానికి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉండాలన్నారు. వినియోగదారుల సంఘం నాయకుడు వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి, పిఎస్ మూర్తి ప్రసంగించారు.

ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు నాయుడు

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 14 : ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ స్వీకారం చేపట్టిన వెంటనే ఐదు పథకాల ఫైల్స్ పై సంతకాలు చేయడంపై జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి హర్షం ప్రకటించారు. మెగా డీఎస్సీతో దాదాపు 16,350 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడం, రైతులకు నష్టం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం, వృద్ధులకు పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడం, అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి గణన లాంటి పథకాలు కోట్లాది ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంపొందిస్తాయని తెలిపారు. చట్ట, రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించని, అవినీతిని ప్రోత్సహించిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను, జిల్లా, మండల అధికారులపై చట్టబద్ధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఏ అధికారి అయినా ఇలాంటి తప్పులు చేయడానికి భయపడే విధంగా చర్యలు వుండాలన్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులను ప్రోత్సహించాలని, గౌరవించాలని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు.

నేడు చంద్రమౌళీనగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, జూన్ 14 : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా చంద్రమౌళీనగర్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ ఏఈ చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిలను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నేతలు బోనబోయిన శ్రీనివాస్, గాదె వెంకటేశ్వరరావు



రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, బీసీ నేతలు గురుమూర్తి, మల్లెల ఈశ్వరరావు, తిరుమలరావు, హనుమంతరాజు, బాలు తదితరులు

హైరిస్కు గర్భిణులకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు తప్పనిసరి

• కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, జూన్ 14: జిల్లాలోని హైరిస్కు గర్భిణులకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు 8 నుంచి 9 నెలల మధ్యలో తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గర్భిణులకు బీపీ, షుగర్, హెచ్ బి, థైరాయిడ్ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి జిల్లాస్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో డిసెంబర్ నుండి మార్చి వరకు సంభవించిన ఆరు మాతృ మరణాలకు గల కారణాలపై వైద్యులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ కేసుల్ని ముందుగానే గుర్తించి పై స్థాయి ఆసుపత్రులకు చెకప్‌కు, కాన్పుకు పంపించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, డాక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సిజేరియన్ డెలివరీ అయిన స్త్రీని కనీసం ఐదు రోజులు తప్పనిసరిగా ఆసుపత్రిలోనే ఉంచాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మందుల షాపులు, సిజేరియన్ కాన్పులు అధికంగా జరుగు ఆసుపత్రులను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రావణ్ బాబు, డాక్టర్ సిహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు, డీసీహెచ్ఎస్‌లతో పాటు ఇతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు శానిటేషన్ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలి

• కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 14 : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నగరంలోని శానిటేషన్ కార్యదర్శులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శి తమ పరిధిలో ప్రతి రోజు ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల్లో ప్లాస్టిక్, బ్యాన్ చేయబడిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌గా విభజన చేసి అంచనా చేయాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ, జీఎంసి ఎస్ఎస్‌లు ఆనంద కుమార్, రాంబాబు, ఆయుబ్ ఖాన్, సోమ శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కు.ని, యాంటీ రేబిస్ టీకాలు

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 14 : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటి రేబిస్ టీకాలు చేయడం జరుగుతుందని, ప్రజలు, జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ అధికారుల కమిటీ పర్యవేక్షణలో నిర్దేశిత నిబంధనల మేరకు స్థానిక ఏటుకూరు రోడ్‌లోని ఏబిసి సెంటర్‌లో నిపుణులైన పశువైద్యులచే వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, అనంతరం వాటికి తగు వైద్యం, ఆహారం అందించి, కోలుకున్న 4 రోజుల పిదప మళ్లీ యథాస్థానంలో విడిచి పెట్టడం జరుగుతుందన్నారు.

నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని నియమించాలి



మాజీ ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు(విద్య), జూన్ 23 : నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 14 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయుల్ని నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి.హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జేకేసీ కళాశాల రోడ్డులోని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ నివాసానికి వెళ్ళి వినతిపత్రం అందజేశారు. గత విద్యాసంవత్సరం డిప్యూటేషన్ పై నియమించిన ఉపాధ్యాయులు తిరిగి అదే పాఠశాలలో నియమించాలని కోరారు. జీవోనం.84ను రద్దు చేసి మున్సిపల్ ఉపాధ్యాయుల్ని విద్యాశాఖ నుంచి మున్సిపల్ శాఖకు పంపాలని కోరారు. యాప్‌ల భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జిలానీబాషా, పి.శ్రీనివాసరావు, రాంబాబు, ఎన్‌బి తిలక్, జివి రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే మెగా డీఎస్సీ ప్రకటించి టీచర్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎన్‌టీఏ నాయకులు బి హైమారావు తదితరులు ప్రకటించారు.

గ్రంథాలయ సెస్సు వసూళ్లపై దృష్టిసారించాలి


గుంటూరు(విద్య), జూన్ 14 : జిల్లాలో గ్రంథాలయ నిర్వాహకులు గ్రంథాలయ సెస్సు వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టి, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయ నిర్వహణ, గ్రంథాలయాలకు పాఠకులు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని కోరారు. సీనియర్ సహాయకులు మల్లంపాటి సీతారామయ్య, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వాహకులు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రిన్సిపల్స్ పదోన్నతులపై అసత్యప్రచారాలు

గుంటూరు(విద్య), జూన్ 14 : ఇటీవల ఇంటర్ విద్యలో నిర్వహించిన ప్రిన్సిపల్ పదోన్నతుల విషయంలో ఆరోపణలు చేస్తూ వైసీపీ అనుబంధ సంఘాలు అసత్యప్రచారాలు చేస్తున్నాయని తెలుగునాడు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సూర్యదేవర శ్రీనివాసరావు, చెన్నుపాటి ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత న్యాయ స్థానాల జోక్యంతోనే పదోన్నతులు నిర్వహించారని తెలిపారు. పదోన్నతులు అడ్డుకునేందుకు వైసీపీ సంఘాలు ప్రయత్నిస్తున్నాయని, అసత్య ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చినందున ఖాళీలు భర్తీ చేసి ఇంటర్ కళాశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పవర్‌ఫుల్ పాత్రలో...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: చోటా. కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.



జైలు నుంచి హేమ విడుదల



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TmE38l7లో చదవండి.



పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్శిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు.



ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారికా కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎదురోలు



నా కోరిక తీరింది

చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కే.కే.ఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

దిక్సూచి DIKSUCHI

నిమ్స్‌లో పీహెచ్‌డీ



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాల వారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్ల గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/c2lwxdNలో చదవండి.

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్.. రెగ్యులర్ ప్రాతిపదికన ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 (150) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

పోస్టింగ్: హైదరాబాద్, కోల్‌కతా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27

వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. అడ్‌హక్ ప్రాతిపదికన 3 జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు

ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24

వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://nfc.gov.in/

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్న నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సురేష్ తదితరులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, మారీసుపేట జూన్ 14: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో మాల మహానాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు జ్యోతుల బాబీ తన మిత్ర బృందంతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మాజీమంత్రి ఆలపాటి పార్టీ కండువాని కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు న్యాకత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధిబాట పడుతుందన్నారు. సంపద సృష్టించాలన్నా, యువతకు ఉపాధి కల్పించాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమన్నారు. బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించేది ఒక్క తెలుగుదేశం పార్టీతోనే, అందుకు నిదర్శనం రాష్ట్ర క్యాబినెట్ కూర్పు అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్‌కుమార్, పట్టణాధ్యకుడు తాడిబోయిన హరిప్రసాద్, శుద్దపల్లి నాగరాజు, అత్తోట శరత్, మల్లవరపు విజయ్, నలుకుర్తి రమేష్, మున్న దుర్గాప్రసాద్, దిలీప్‌కుమార్, నాయక్, మనోహర్, భాష, అజయ్, సుల్తాన్, కృష్ణంరాజు, జహీర్, సత్యసాయి, కుమార్, సదాశివ, బాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న రమేష్, శ్రీనివాసరావు తదితరులు

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట జూన్ 14: స్థానిక శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని కాళీమాత దేవస్థాన చైర్మన్ గుమ్మడి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతి నెల రెండో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేకా సురేష్, కందెపి సీతారామయ్య నిరంజన్, మెడికల్ సుబ్బారావు, ఎన్ వెంకటేశ్వరావు, రామకృష్ణ, డాకా అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలిలా ఉంటే ఇన్నేళ్లు ఏం చేస్తున్నారు

● అధికారులపై మంత్రి మనోహర్ మండిపాటు
● వారంలో 8 కాల్వల పూడిక తొలగించాలి
● నీటిపారుదల, డ్రెయినేజీ అధికారులకు మంత్రి ఆదేశం
● పట్టణంలోని మురుగు కాల్వలకూ మోక్షం



పంట కాల్వలో చెత్తపై ఇరిగేషన్ ఇ.ఇపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మనోహర్

తెనాలి, జూన్ 14, (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో నీరు తప్ప అన్నీ నిండిపోయాయ్... ఇంత చెత్త పేరుకుపోతే రైతులకు నీరు ఎట్లా చేరుతుందనుకున్నారు? కాల్వలు ఇంత దారుణంగా ఉంటే ఇన్నేళ్లుగా ఏం చేస్తున్నారు? అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నీటిపారుదల శాఖ, డ్రెయినేజ్, మున్సిపల్ అధికారులతో కలసి కాల్వల తీరును పరిశీలించారు. అప్పటికే పట్టణంలోని మురుగు కాల్వల్లో పూడికతీయటం, మురుగు టన్నులకొద్దీ గుట్టలుగా బయటపడటంపై ఆశ్చర్యపోయారు. ఇంత పూడిక డ్రెయిన్‌లలో ఉంటే ఇంతకాలం ఏం చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ప్రశ్నించారు. లారీలకొద్దీ చెత్త కాల్వల్లో పేరుకుపోతే మురుగు నీరు ఎట్లా వెళుతుందని మండిపడ్డారు. చిన్న వర్షానికే రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోతున్నా కనీసం ఇంతకాలం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వలన్నీ వారంలో పూడిక లేకుండా ఉండాలని ఆదేశించారు. తర్వాత తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలను పరిశీలించారు. రేపల్లె, నగరం, పి.వి.పాలెం, బాపట్ల మండలాల వరకు సాగునీటిని అందించే కాల్వలు కావటం, అవన్నీ మట్టి, చెత్తతో నిండిపోవటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఇ.ఇ, డ్రెయినేజీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పూడిక పేరుతో ఖర్చుపెట్టి నిధులకు జవాబుదారీగా ఉండాలన్నారు. కాల్వలు ఇట్లా ఉంటే దిగువకు నీరు ఎట్లా చేరుతుందని ఇరిగేషన్ ఇ.ఇ మల్లికార్జున్‌ను ప్రశ్నించారు. రేపటి ఖరీఫ్ సీజన్ వచ్చేస్తుంటే పనులు ఇంకెప్పుడు చేస్తారని ప్రశ్నించారు. రైతులు మూడేళ్లుగా నీరందటంలేదని మొరపెట్టుకుంటుంటే కనీసం పూడిక తీద్దామనే ఆలోచన కూడా రాలేదా! అని ప్రశ్నించారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు ప్రభుత్వం నుంచి రూ.20 నుంచి రూ.30 కోట్ల వరకు ఓ.అండ్.ఎం నిధులు మంజూరవుతున్నాయి కదా! అ నిధులన్నీ ఏమైపోయాయని ప్రశ్నించారు. వారంలో 8 ప్రధాన కాల్వల్లో 47 కి.మీటర్ల పొడవున ఎక్కడా పూడిక లేకుండా మొత్తం తొలగించాలని ఆదేశించారు. అయితే ఆయన పర్యటన సమయంలోనే పొక్లెయిన్‌లు తూర్పు కాల్వలో పూడిక తీయటం మొదుపెట్టేయటం విశేషం. గత ప్రభుత్వ కాలంలో నేతలు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవటం వల్లే కాల్వల్లో నీరు అందలేదని, ఒక్కసార కూడా వేసి పూడిక తీసిన పాపాన పోలేదని కొందరు రైతులు మనోహర్ దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లొచ్చాక తూటుకాడ తొలగించటానికి రసాయనాలు చల్లామంటూ నీరు చల్లిపోయేవారని, ఒక్క కాడకూడా మాడిపోయేది కాదని, చివరకు మేమే రైతులందరం కలసి కాల్వలోకి దిగి తీసేసుకునేవారిమని మరికొందరు రైతులు కష్టాలు ఏకరవు పెట్టారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు.



డ్రెయిన్లలోని సిల్ట్‌ను తొలగిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

డ్రెయిన్లలో పూడికతీత

తెనాలి, మారీసుపేట జూన్ 14: ఆంధ్రప్రదేశ్ కూటమి మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు డ్రెయిన్లలో పూడిక తీత పనులను ప్రారంభించారు. స్థానిక బోసురోడ్డులో చిట్టాంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం డ్రెయిన్లలోని సిల్ట్‌ను తొలగించే కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు ఆగమేఘాలమీద ప్రారంభించారు. పట్టణంలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టలేదని పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. కొంత కాలంగా మురుగు కాల్వలలోని వ్యర్థాలను తొలగించక పోవడంతో, వ్యర్థాలు పేరుకుని చిన్నపాటి వర్షానికి మురుగు కాల్వలు పొంగి మురుగు రహదారులపై పారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వైభవంగా సంపూర్ణ శాంతి హోమం

తెనాలి, మారీసుపేట జూన్ 14: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమంను వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజు శుక్రవారం ఉత్తరానక్షత్రం వారిచే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ ఋత్విక్కులచే యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ ఉత్తరా నక్షత్రం విశిష్టతను, విశేషాలను తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, కోన నాగేశ్వరావు, గోపు రామకృష్ణ, లోకనాధం, ఎంఎం రాజేష్, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు



మదర్సా శంకుస్థాపన ప్రార్థనల్లో పాల్గొన్న నరేంద్ర కుమార్

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, జూన్ 14: ముస్లింల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో బరాయే ఖావాతీన్ ఇస్తాహి నురాని మదరస శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శంకుస్థాపనకు ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే ధూళిపాళ్లకు ముస్లిం మత పెద్దలు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం మదరస్సా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముస్లింల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫైరోజ్ ఖాన్, సైయ్యద్ అమీన్ పీర్, రహం తుల్లా, మగ్బుల్ బేగ్, షేక్ బాజీ సాహెబ్, జానీ బేగ్, షేక్ సుల్తాన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అరుణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల తదితరులు

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 14: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నన్నపనేని బాలకృష్ణ తల్లి నన్నపనేని అరుణ (62) శుక్రవారం మృతి చెందారు. అరుణ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నిడుబ్రోలులోని బాలకృష్ణ గృహానికి వెళ్లి అరుణ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం బాలకృష్ణ అయన హరిబాబు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నన్నపనేని అరుణకు పట్టణంలోని పొన్నూరు, నిడుబ్రోలుకు చెందిన టీడీపీ నాయకులతో పాటు, రోటరీ క్లబ్ నిర్వాహకులు, సైక్లింగ్ క్లబ్ సభ్యులు పట్టణ ప్రముఖులు నివాళులు అర్పించారు.

నీట్ పరీక్షల నిర్వహణ వైఫల్యం శోచనీయం: చందు

తెనాలి అర్బన్, జూన్ 14: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యం శోచనీయమని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు విమర్శించారు. మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, కొన్ని సెంటర్లలో అందరికి ఒకే మార్కులు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటూ గ్రేస్ మార్కులు ఇవ్వాలనే మరో ఆలోచన సరికాదన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన న్యాయం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీ నాయకులు యన్నం శివరామకృష్ణ ప్రసాద్, మల్లవరపు ప్రసాద్, పొన్నూరు శశి, దారా రామకృష్ణ, బుల్లియ్య, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

చంద్రబాబుపాలనతోనే అభివృద్ధి, సంక్షేమం

● మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, జూన్ 14: జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో దౌర్జన్యాలు దోపిడీలు, గంజాయి, అక్రమ మద్యం ఏరులైపారితే చంద్రబాబుపాలన ప్రారంభంతోనే అభివృద్ధి సంక్షేమం వైపు పరుగులు పెడుతుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆ పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ గత ఐదేళ్లపాలనలో రాష్ట్రం దాదాపుగా 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. జగన్ పాలన ప్రారంభంలోనే ప్రజావేదిక కూల్చివేసి తమది విధ్వంసపాలనని ముందే రాష్ట్ర ప్రజలకు సంకేతమిచ్చారని అది మొదలు పేదలకు కడుపునింపే అన్న క్యాంటీన్లను సైతం మూయించి వారి పొట్టకొట్టి ఆకలి బాధకు కారకులయ్యారని విమర్శించారు. సంక్షేమం పేరుతో అన్నింటా ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచిన ఏకైక ప్రభుత్వం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ఆగ్రహవ్యక్తం చేశారు. రాజధాని అమరావతి కోసం రైతులు తమ పంటభూములను సైతం త్యాగం చేస్తే జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రం భూములిచ్చిన రైతుల త్యాగాలకు బదులు వారి కులాలు గుర్తుకు వచ్చాయని మండిపడ్డారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించి నిర్ణయంతీసుకోవాల్సి ఉండగా ప్రజల పక్షాన మాట్లాడుతున్న చంద్రబాబునోరు మూయించేందుకు ఆయనను, ఆయన కుటుంబసభ్యులను తీవ్రంగా అవమానించి చంద్రబాబు కంటనీరు కార్చేలా సభను జరపడం సిగ్గుచేటు అన్నారు. మేము సంక్షేమ పథకాలు ఇచ్చాం ప్రజలు బానిసల్లా పడిఉంటారన్న జగన్ ఆలోచనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలుగుదేశం తరుపున వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి ప్రాంతంలో కూటమి అభ్యర్థులు నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్‌లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో అమరావతి రాజధానిగా పోలవరం ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కావడంతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారనుందన్నారు. తెనాలి ప్రాంతంలో మంత్రిగా నాదెండ్ల మనోహర్, కేంద్రమంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ల సహకారంతో ప్రాంత అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్‌కుమార్, మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదుల మహేష్, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద టీడీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షాతిరేకాలు

అనితకు హోంశాఖ ఇవ్వడంపై హర్షం

● అంబేడ్కర్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

తెనాలి రూరల్, జూన్ 14: రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలుగా పనిచేసిన వంగలపూడి అనితకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన క్యాబినెట్‌లో చోటు ఇవ్వడంతోపాటు కీలకమైన హోంశాఖ మంత్రి పదవిని కేటాయించడంపై తమకు సంతోషంగా ఉందని టీడీపీ నాయకులు, మాస్‌యాత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఎస్సీసెల్, ఎమ్మార్పీఎస్ నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేసి హర్షం వక్తం చేశారు. సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అనితపై అనేక విధాలుగా వేధింపులకు తెగబడ్డారని ఆమె అన్నింటిని తట్టుకుని పార్టీ కోసం నిలబడ్డారన్నారు. ఆమెకు చంద్రబాబునాయుడు హోం శాఖ మంత్రిగా పదవిని కట్టబెట్టి దళితులపై ఉన్నప్రేమను చాటారని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పవన్ కల్యాణ్ కూటమి విజయానికి ప్రత్యేక కృషి చేశారని ఆయనకు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు అత్తోట శరత్, కూచిపూడి మోహన్‌మాదిగ, టీడీపీఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు నలుకుర్తి రమేష్, యడ్లపల్లి అనీల్, రావూరి సతీష్, లింగాల రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండమూడి బోస్‌బాబు, ఎన్నం సన్నీ, ఇమ్మానుయేలు, సంపత్, రేబో, పొన్నెకంటి లోకేశ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు మధుసూదనరావు జయంతి

తెనాలి అర్బన్, జూన్ 14 : చలన చిత్రాలకు దర్శకుడిగా పని చేసి విజయాన్ని తన ఇంటి పేరుగా మార్చుకున్న విక్టరీ మధుసూదనరావు చిరస్మరణీయులని న్యాయవాది రెడ్డి వెంకటేశ్వరరావు చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శుక్రవారం వీరమాచనేని మధుసూదనరావు జయంతిని నిర్వహించారు. ప్రజానాట్యమండలి నాయకులు దేవరకొండ నీలంబరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పలుచిత్రాలకు దర్శకత్వం వహించడమే కాకుండా 31 మందికి పైగా దర్శకులను తయారు చేశారని చెప్పారు ఎంతోమంది గొప్ప నటులతో దర్శకత్వం వహించారని, చలన చిత్ర సీమలో తిరుగులేని దర్శకుడిగా పేరుగాంచారని చెప్పారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, భాస్కరరావు, కృష్ణ, రమేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న అధికారులు

స్కూల్ బస్సుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

●ఆర్టీవో కె.ప్రసాద్

తెనాలి క్రైం, జూన్ 14: స్కూల్ బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్టీవో కె.ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల పిలుపునిచ్చారు. తెనాలి ఆర్టీవో కార్యాలయం పరిధిలో వివిధ విద్యా సంస్థలకు చెందిన 370బస్సులు ఉన్నాయని, వీటిలో 325బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయన్నారు. మరో రెండు మూడు రోజుల్లో మిగిలిన బస్సుల ఫిట్‌నెస్‌లు కూడా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. విద్యా సంస్థలకు చెందిన బస్సులు ఖచ్చితంగా మోటారు వెహికల్ చట్టంలోని 185(జి) ప్రకారం 32 నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని బస్సులు, నిబంధనలు పాటించని బస్సులపై కేసు నమోదుచేసి సీజ్ చేయడం జరుగుతుందని ఆర్టీవో హెచ్చరించారు.

పేదలకు ఆహారం అందజేత

పొన్నూరు టౌన్, జూన్ 14: పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని అయన కుమారుడు, కుటుంబ సభ్యులు పట్టణంలోని పలు ప్రాంతాలో శుక్రవారం పేదలు, అనాథలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ నయూమ్ బాషా, రిహాన్ బాషా ఆధ్వర్యంలో ఈ ఆహార పొట్లాలను అందించారు.

బోరుగడ్డ కార్యాలయం దహనంపై కేసు

గుంటూరు, జూన్ 14: గుంటూరు నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వల్లూరివారితోట 6వ లైనులో రెండు రోజుల క్రితం వైసీపీ కార్యకర్త బోరుగడ్డ అనిల్ కార్యాలయంలో ఫర్నీచర్ దహనం చేసిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా కాలువలు

○ ఐదేళ్లుగా నీటికోసం రైతుల ధర్నాలు
○ ఖరీఫ్‌సాగుకు రైతుల సన్నాహాలు
○ కాలువలు సిద్ధంచేయాలని వినతులు
○ కూటమి ప్రభుత్వంపై రైతన్నల ఆశలు



జమ్ము, గడ్డితో నిండి ఉన్న బుర్రిపాలెం రోడ్డులోని కాలువలు

తెనాలి రూరల్, జూన్ 14: గత ఐదేళ్లుగా వ్యవసాయానికి ప్రధాన భూమికగా ఉన్న పంట, మురుగు కాలువల నిర్వహణ వైసీపీ ప్రభుత్వం చేపట్టకపోవడంతో సాగుకు అవసరమైన నీరుఅందక, అకాల వర్షాలకు పంట పొలాల్లో నీరు బయటకుపోయే వీలు లేక పంటలు దెబ్బతిని రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నష్టపోయిన రైతులకు కనీసం భరోసా కల్పించలేకపోగా మరోమారు రైతాంగానికి నష్టం కలుగకుండా కాలువల మరమ్మతులు చేపట్టేలా అధికారులను పురమాయించిన దాఖలాలు కూడా పెద్దగా కనిపించలేదు. ఫలితంగా పలు ప్రాంతాల్లో రైతులు క్రాప్‌హాలీడేస్ ప్రకటించే పరిస్థితి నెలకొంది. మరి కొందరు జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని విడిచి మరో పనిచేసుకోలేక దేవుడిపై భారంవేసి సాగు చేపట్టారు. వ్యవసాయంలో ఐదేళ్లుగా లాభాలు చూడని అన్నదాతలకు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆది నుంచి సాగునీరు కోసం రైతులు రాత్రిపగలు కాలువల చుట్టూ తిరుగుతూ ఆయిల్ ఇంజన్ల సాయంతో తడులు వేసుకుంటూ పంటలు సాగుచేయాల్సిన పరిస్థితి గత ప్రభుత్వంలో నెలకొంది. మండలంలోని కొలకలూరు - ఖాజీపేట, అనుమర్లపూడి డొంక, నేలపాడు, బుర్రిపాలెం రోడ్డు వంటి ప్రాంతాల్లో సాగునీరు కోసం రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన పరిస్థితి కూడా గత ప్రభుత్వంలో చోటుచేసుకుంది. దాని ఫలితంగా అడపాదడపా విడుదల చేసిన నీటితో పంటలు తడుపుకునేందుకు రైతులు ఆయిల్ ఇంజన్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఇదే క్రమంలో కొలకలూరుకు చెందిన పి.ఇశ్రాయిల్ అనే రైతు ట్యాబులుపరచి నీటికోసం ఇంజన్ వేసేందుకు గట్టుపైనే ఎదురుచూస్తు గుండెపోటుతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సాగునీరందక, తుఫాను వంటి సమయంలో పంట పొలాల్లోనీరు బయటకు పోక అరుగాలం పండించిన పంట నష్టపోయి సాగుకు చేసిన అప్పులు తీర్చలేక మనోధైర్యం కోల్పోయి మరో కౌలురైతు గోపిశెట్టి నాగరాజు ఆత్మహత్యకుపాల్పడి ప్రాణాలు విడిచాడు. ఖాజీపేటలో మరో కౌలురైతు కూడా ఇదేవిధంగా మృతి చెందాడు. తోటి రైతులు ఈ సంఘటనలతో తీవ్రమనోవేదనకు గురయ్యారు. గతంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. రైతుల తరుపున అప్పటి వైసీపీ ప్రభుత్వంపై నిరసనలు కూడా తెలిపారు. ఐదేళ్లుగా రైతులు పంటలసాగుకు నానా ఇక్కట్లు పడ్డారంటే అతిశయోక్తికాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిగా ఖరీఫ్ సాగుకు రైతులు పనులు మొదలు పెట్టబోతున్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇదే ప్రాంతానికి చెందిన జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లు కాలువల మరమ్మతులపై పూర్తిగా దృష్టిపెట్టి రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు.



ఖాజీపేటలో వర్షపునీరు బయటకు వెళ్లే వీలులేక నీటమునిగిన వరి పైర్లు (ఫైల్ ఫొటో)

పంట కాలువల మరమ్మతులు చేయించాలి

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు

దేశానికి అన్నంపెట్టే రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అప్పటి ఎన్నికల ప్రచారంలో పాదయాత్రగా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు వ్యవసాయాన్ని దండుగ కాదు పండగగా చేయిస్తానని మాయమాటలు చెప్పి పంటకాలువలు కూడా పూడిక తీయించలేకపోయారు. ఫలితంగా సాగుకు నీరు అందక, తుఫాను వంటి వాటికి పంట పొలాల్లో నీరు బయటకుపోక రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. రైతులకు మేలుకోరే కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. ఇకనైనా మండలంలోని రైతులకు అండగా నిలిచేలా అధికారులు తక్షణమే పంట కాలువలు పూడికతీత పనులు ప్రారంభించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంతప్‌రాయుడు కోరారు.

చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తారు

● నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి

తెనాలి, మారీసుపేట జూన్ 14: రాష్ట్రాన్ని నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలోకి తీసుకువెళతారని తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అంగలకుదురు గ్రామంలో శుక్రవారం గ్రామ తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ సూద్యదేవర వెంకట్రావు, టీడీపీ నాయకులు కరణం వెంకటేశ్వరావుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళగా దుర్మాగపు వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లవలసి వచ్చిందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రూపకర్త ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి, యువతకు ఉపాధి కల్పిస్తారని అన్నారు. అనంతరం రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థులు గెలవాలని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నిక కావాలని మొక్కిన మొక్కులను తీర్చుకునేందుకు గ్రామ మహిళ కార్యకర్తలు పాదయాత్రగా తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని స్వామివారు, అమ్మవార్లను దర్శించి కొమ్మరికాయలను కొట్టి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చందబాబుకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని, నిండు నూరేళ్ళు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఉసరపు రాజ్యలక్ష్మీ, నలకుర్తి విజయ, చెన్నుపాటి లక్ష్మయ్య, అయినంపూడి పార్వతి, జాలాది భవాని, చెన్నుపాటి తేజశ్రీ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మొక్కు తీర్చుకోవడానికి పాదయాత్ర చేస్తున్న టీడీపీ మహిళా కార్యకర్తలతో మాజీమంత్రి రాజేంద్రప్రసాద్ తదితరులు



మొక్కు తీర్చుకోవడానికి వెళ్తున్న కార్యకర్తల యాత్రను జెండా ఊపి ప్రారంభించిన మాజీమంత్రి రాజేంద్రప్రసాద్

మల్లెపాడులో...

తెనాలి, మారీసుపేట జూన్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష, ఆదేవుని ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఎన్నికైనారని మువ్వా డేవిడ్ ఆధ్వర్యంలో మొక్కు తీరుచకోవడానికి నాగపట్నం బస్సులో బయలుదేరి వెల్లారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిదిగా పాల్గొని బస్సును జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీశ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

టీఎన్‌ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పెదకాకాని, జూన్ 14: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పై పెట్టడంతో విద్యార్థులు ఆనందంతో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రధాన ముఖద్వారం వద్ద నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ఎందరో నిరుద్యోగుల కల అని, గత ప్రభుత్వం ఐదేళ్లలో మెగా డీఎస్సీ ఇస్తానని మాట ఇచ్చి కనీసం ఒక్క పోస్ట్ కూడా రిలీజ్ చేయకుండా ఎంతోమంది విద్యార్థులను నిరాశపరిచిందన్నారు. గత ప్రభుత్వంలో మన రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరుకుందని కానీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన మరుక్షణం అమరావతిలో పనులు వేగంగా చేయించడం మొదలుపెట్టారన్నారు.ఎంతో మంది నిరుద్యోగులకు ఇది శుభ సూచకం అన్నారు. ఎందుకంటే అమరావతి గనక రాజధానిగా ఎదిగినప్పుడు అది ఎంతోమంది విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ టి.ఎస్.ఎస్ ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ఇవ్వటంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికి వదిలేసారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా మొదటి సంతకం విద్యార్థులు నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని మెగాడీఎస్సీ పై పెట్టటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ టి.ఎన్ ఎస్ ఎఫ్ సభ్యులు జి.రాకేష్, ఈశ్వర్, సుజిత్, అజయ్ అజయ్, నాసరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆకలితీర్చనున్న అన్న క్యాంటీన్లు



మార్కెట్ ప్రాంతంలో మూతబడిన అన్న క్యాంటీన్

తెనాలి రూరల్, జూన్ 14: తెలుగుదేశం పార్టీ హయాంలో పేదల ఆకలి తీర్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్న ఎన్టీఆర్‌పేరిట అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేశారు. వీటిని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని మూసివేశారు. వాటిని తెరిచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తెనాలి పట్టణంలో మూడు క్యాంటిన్లను ఏర్పాటు చేశారు. అందులో పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే మునిసిపల్ మార్కెట్ వద్ద ఒక క్యాంటిన్, బస్‌స్టాండ్ సమీపంలో మరోక క్యాంటిన్, జిల్లా ప్రభుత్వవైద్యశాల వద్ద రోగులకు, వారి సహాయకులకు అందుబాటులో ఉండేలా ఒక క్యాంటిన్ల ద్వారా ఆహారం అందించారు. చంద్రబాబు పేరు ప్రజల్లో నానుదుండనే దురుద్దేశంతో వాటిని నిలుపుదల చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఆ భవనాలను సైతం పాడుబెట్టి కళావిహీనంగా మార్చారు. టీడీపీ హయాంలో లక్షల మంది ఆకలితీర్చిన క్యాంటీన్‌లను పాడుబెట్టడం పట్ల ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమయింది. అయితే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎక్కడ కేసులు పెడతారో లేదా దాడులు చేస్తారో అన్న భయంతో వాటిని ప్రశ్నించకుండా మౌనం వహించారు. ప్రతి రోజు ఆహారం కోసం వచ్చి కడుపునింపుకుంటూ ఉన్న పేదలు అక్కడ ఆహారం అందకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగటాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి వచ్చింది. దీంతో దాతల సహాయ సహకారాలతో తిరిగి తెనాలిలో రెండు అన్న క్యాంటిన్లను ప్రారంభించి ప్రజల మన్ననలు పొందారు. దీనిపై అప్పటి అధికారపార్టీ వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆ క్యాంటిన్లను మూయించేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చేంత వరకూ కూడా ఈ క్యాంటిన్ల ద్వారా మాజీ మంత్రి ఆలపాటి నేతృత్వంలో ఆహారం అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీని పరాజయం పాలుచేసిన ప్రజలు కూటమి ప్రభుత్వం పేదల ఆకలితీర్చే చంద్రబాబు పాలనకు స్వాగతం పలకడంతో అన్న క్యాంటిన్లకు నూతన కళ చేకూరనుంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబునాయుడు అన్నక్యాంటిన్ల సేవలను పునఃప్రారంభించేందుకు సంతకాలు చేసి అధికారులకు ఆదేశాలివ్వడంతో ప్రజల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం: మాదాల

పొన్నూరు టౌన్, జూన్ 14: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలును కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని టీడీపీ సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి ఐదు సంతకాలు చేశారన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందనే దానికి ఈ సంతకాలే నిదర్శనం అన్నారు. జగన్‌రెడ్డి అరాచకపాలక సాగించి రాష్ట్రాని సర్వనాశం చేసారన్నారు. దౌర్జన్య, దోపిడీ పాలనకు విసిగిపోయిన ప్రజలు వైసీపీని తరిమికొట్టి కూటమికి 164 సీట్లు ఇచ్చి అఖండ విజయం కట్టబెట్టారన్నారు. ప్రజల రుణం తీర్చుకునేలా మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టి నిరుద్యోగుల జీవితాల్లో చంద్రబాబు వెలుగులు నింపుతున్నారన్నారు. అలాగే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారన్నారు. సామాజిక పెన్షన్లను 4 వేలకు పెంచుతూ 3వ సంతకం, అనాథల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ 4వ సంతకం, యువతకు నైపుణ్య ఇచ్చి ఉపాధి కల్పించేందుకు శిక్షణకు 5వ సంతకం చారిత్రాత్మకమన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతుందని తెలిపారు. ఎలాంటి వివక్షతకు తావులేకుండా అందరికి సమన్యాయం జరిగేలా కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బిజేపి నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై న్యాయవాదుల హర్షం

తెనాలి క్రైం, జూన్ 14: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండో సంతకం చేయడంపై తెనాలి బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తానని చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే ఈ నల్లచట్టాన్ని రద్దుచేస్తూ రెండో సంతకం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా న్యాయవాదులు వివిధ స్థాయిల్లో ఈ చట్టం రద్దు కోసం పోరాటాలు, నిరసనలకు దిగారని ఆయన గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా అప్పుడే తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించారని, అదే విధంగా తెనాలి బార్ అసోసియేషన్ చేపట్టిన వివిధ నిరసన కార్యక్రమాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు మద్దతుగా నిలిచారని ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్ మాట్లాడుతూ ల్యాండ్ టైటలింగ్ చట్టం అమలు కోసం జగన్ సర్కార్ భూ సర్వే పేరుతో కోట్ల రూపాయలు దోపిడి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, అనిత, గాదెలవర్తి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానుల కళ్లలో వెలుగులు తెచ్చారు : వట్టికూటి

పొన్నూరు టౌన్, జూన్ 14: గత ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నించిన భూ హక్కుల చట్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేయటం హర్షనీయమని అన్ని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వట్టికూటి లీలాప్రసాద్ శుక్రవారం అన్నారు. చట్టాని రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. చట్టం రద్దు ద్వారా భూ బకాసురుల బారి నుంచి భూములను కాపాడుకునేలా భూ యజమానుల కళ్లలో వెలుగులు తీసుకొచ్చారన్నారు. తాతల కాలం నుంచి తమ స్వాధీనంలో ఉన్న భూములపై హక్కులకు విఘాత పరిచేలా గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సరైనరీతిలో సరైన సమయంలో అడ్డుకున్నారన్నారు. అత్యంత క్రూరమైన ఈ చట్టాని రద్దుచేయటం ద్వారా ప్రజలకు న్యాయవాద సంఘాలకు ఇచ్చిన హామీని అమలు చేయటం చంద్రబాబు చిత్తశుద్ధికి ధృఢ సంకల్పానికి నిదర్శనం అన్నారు. ఆంధ్రరాష్ట్రాని దేశచిత్రపటంలో అగ్రస్థానంలో ఉంచేలా ప్రజా రంజకమైన సంక్షేమ చర్యలు, సంస్కరణలు తీసుకురావాలని లీలా ప్రసాద్ ఆకాంక్షించారు.



జీవ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి, డాక్టర్ శారద, డాక్టర్ దక్షిణామూర్తి, మనోహరం తదితరులు

మరింత మంది రక్తదాతలు అవసరం

● మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, జూన్ 14: సమాజానికి మరింత మంది రక్తదాతలు అవసరమని తగినంత రక్తం లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి రక్తదాన అవశ్యకతపై డాక్టర్ శారద తెలుగు, ఆంగ్ల భాషలలో రచించిన జీవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డాక్టర్ శారద ఎన్నో సేవలు అందిస్తున్నారని, ఇందుకు మనమంతా ఆమెకు రుణపడి ఉన్నామన్నారు. క్యాన్సర్ రూపు మాపేందుకు వైద్య శిబిరాలు, మధుమేహ నివారణకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు కరోనా కష్టకాలంలో ధైర్యంగా వైద్య సేవలు అందించారని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి మనోహరం మాట్లాడుతూ, రక్తదాన అవశ్యకతను వివరిస్తూ డాక్టర్ శారద చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని రక్తదాతల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఏటా ఎంతో మంది రక్తం లేకపోవడంతో రోగులు మృతి చెందడం బాధాకరమన్నారు. అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యక్కల రామమోహనరావును సత్కరించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ, రక్తదానం చేసేందుకు గాను పేరు నమోదు చేసే క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశామని, ఈ కోడ్ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదై రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, చదలవాడ నాగేశ్వరరావు, చదలవాడ సుధ, అక్కినేని మణి, కె.ప్రభాదేవి, పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రహ్మణ్యం, నీలిమ చౌదరి, వాణి ప్రియ ప్రసంగించారు.



చే గువేరకు నివాళులర్పిస్తున్న ప్రజా నాట్య మండలి నాయకులు

చే గువేరకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 14: సామాజిక విప్లవ వీరుడు చేగువీర అన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో చే గువీర జయంతిని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జెంటీనాలో పుట్టిన చే గువీర చేసిన పోరాటాలను క్యూబా విముక్తి కోసం చేసిన ఉద్యమాలను మననం చేసుకున్నారు, చే గువేర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు, చైతన్య, దవరకొండ శ్రీనివాస్, సుధీర్, పీనుగుల సత్యనారాయణ, రత్నబాబు, రజేష్, బాబురావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.